# దేవుడింకా ఉన్నాడు!

ఇటీవల నేను మా స్వగ్రామం వెళ్ళాను. నాకు అయినవాళ్ళంతా అక్కడే ఉన్నారు. వాళ్లని చూసి పదేళ్లయింది. నేను జంఝాలు తెంపేసి, తద్దినాలు మానేసి ఏనాడయితే వితంతువును, అందులో మరో శాఖదాన్ని పెళ్లాడానో ఆనాడే నాకూ మా బంధువులకూ ఋణం తీరిపోయింది. నేను మా ఊరు వదిలిపెట్టి వెళ్ళిపోతున్నానన్నప్పుడు అందరూ సంతోషించారు. నా ప్రయాణానికి ముహూర్తాలు పెట్టారు. "ఎప్పుడు వెళ్ళటం?" అని ఒకటికి పదిసార్లు అడిగారు, "ఇంకా పోలేదా?" అని కూడా అడిగారు. అయిపోయింది. నేను ఊరు విడిచి వచ్చేశాను. వాళ్ల కోరిక ఫలించిందని నేనూ సంతోషించాను.

కాని వారికి సంతృప్తి కలిగినట్టు లేదు. నేను వాళ్ళ మొహం చూడకుండా పదేళ్ళు గడపగలగటం వారు సహించలేక పోయినారు. నాకు బంధువులమీద ప్రేమే లేదన్నారు. ఎవరు బ్రతికున్నారో, ఎవరు చచ్చారో కూడా నేను పట్టించుకోవటం లేదన్నారు. నాకు నిష్ఠురపు ఉత్త

రాలు రాశారు. చివరకు నేను మోసపోయినానాను. వాళ్లంతా కాలంతోపాటు మారారనుకున్నాను. నిజంగా సంతసిస్తున్నారని నమ్మాను. వెళ్లాను.

అరుగుమీద చాపేసి కూర్చోబెట్టారు నన్ను. ఊళ్లో ఉన్న బంధువులంతా చేరారు. మామూలు కుశలప్రశ్నలు వేశారు. సమాధానం చెప్పాను. సంభాషణ ఆగిపోయింది.

అందరి మొహాలకేసి చూశాను. ఎవరి మొహానా ఒక సంతోషంగాని, విచారంగాని లేదు.

అకస్మాత్తుగా నిశ్శబ్దం భంగమయింది.

"చావు వెధవా!" అని మా పెద్ద వొదినెగారు తన ఆఖరు కొడుకును ఫెడీమని వీపుమీద ఒక్కటి చరిచింది. వాడు భొకా పెట్టాడు. వాడి మెళ్ళో రెండు తాయిత్తులూ, మొలకు మరొక తాయిత్తు కనిపించింది. పిల్లవాడు చాలా ఆరోగ్యంగా ఉన్నాడు. పొట్ట పెరిగింది. రొమ్ము ఎండుకు పోయింది. కాళ్ళు పుడకలల్లే ఉన్నాయి. తల పెద్దదిగా కనిపిస్తుంది.

"పిల్లవాడట్లా ఉన్నాడేం వదినా?" అన్నాను.

"నేను చేసుకున్న రాత!" అన్నదావిడ.

"ఏమన్నా మందిప్పిస్తున్నారా?"

మా చినతాతయ్య దగ్గాడో, లేక నవ్వాడో, ఆ రెండు చప్పుళ్ళు ఆయన ఒకటిగానే చేస్తాడు.

"భైరవశాస్త్రుల్లా... నవగ్రహ జపం చేసి... తాయెత్తు కట్టాళ్ళే" అన్నాడాయన సావధానంగా.

విషయం మార్చటానికని "ఇక్కడ ఈ ఇటికల పోగేమిటి?" అన్నాను.

"చూడలేదుట్రా? మేడమీద దక్షిణవేపు గది విప్పించేశాం?" అన్నాడు మా పెదనాన్న.

"ఏం" అన్నాను ఆశ్చర్యంగా. మా దిక్కుమాలిన మేడకల్లా అదొక్కటే సుఖమైన గది.

"అందులో తాతయ్య ఉన్నాడు కాదుమరీ?" అన్నాడు పెదనాన్న.

తాతయ్య ఉండటమంటే మీ కర్థంకాదు. మా తాత చచ్చిపోయి దయ్యమై ఆ గదిలో ఉంటున్నాడు. మరేగదిలోకి తాతయ్య రాడు.

"భైరవశాస్త్రుల్లుచేత ముగ్గులూ అవీ వేయించాం. లాభించలేదు. తాతయ్యకు భేతాళమంత్రంవచ్చును కాదు మరీ? భైరవశాస్త్రుల్లు ముగ్గులు పనిచెయ్యలేదు. మారణ హోమం చేశానన్నాడు భైరవశాస్త్రుల్లు. బ్రహ్మహత్య దేనికని మేమంతా వారించాం" అన్నాడు పెదనాన్న.

చినతాత దగ్గాడో లేక నవ్వాడో.

"ఎందుకూ? గది పడగొట్టేస్తే... ఆయనే వెళిపోతాడు. ఆ గదిలో అన్నయ్య ఏమున్నా నిక్షేపం దాచాడా— లేకపోతే ఆ గదిని విడిచి ఎందుకు పోడూ? అని నాకు

సందేహం కలిగింది. సగం అందుకే నేను పట్టుబట్టే గది పడగొట్టించేశా" అన్నాడాయన.

"అన్నీ అనర్థాలుగానే ఉన్నవి కొంపకు. (గొంతు తగ్గించి) సత్యం పెళ్లాం మళ్లీ లేచిపోయింది, గుర్రబ్బండి వాడితో—"

సత్యమంటే మా రెండో అన్న. నేను మావూరు వదిలినాక వాడిభార్య పోయింది. రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఈవిడ అదివర కొకసారి లేచిపోయిందని నాకు తెలీదు.

"ఇదంతా సత్యం మొదటి భార్యపనే! బాలింత చావు కూడా చచ్చిందా? నానా ఏడుపులూ ఏడిపిస్తున్నది. సత్యానికి నెలకోసారైనా కనిపించి, నీ కాపరం సాగనిస్తా రనుకున్నావా, అని బెదిరిస్తూంటుంది. అది లేచిపోయిందంటే పోదూ ? దీనికి నలుగురు పిల్లలు పుట్టారా? మూడోవాడు తప్ప మిగిలినవాళ్ళంతా పోయినారు. అందర్నీ పొట్టన బెట్టుకుంది" అన్నాడు పెదనాన్న.

"మూడోవాణ్ణి వదిలిందేం ?" అన్నాను.

"ఏం వదిలింది, వాడికి అన్నీ ఘోరాలే! డాక్టర్ను వద్దు అంటున్నకొద్దీ మీ పెద్దన్నయ్య పిలిచాడు. వాళ్ళ మొహం! డాక్టర్లేం చెబుతారు? తల్లికి సవాయిరోగం ఉందన్నాడు. నిక్షేపమైన బ్రాహ్మణ కుటుంబంలో సవాయి ఏమిటి వాడి శ్రాద్ధం? భైరవ శాస్త్రుల్లును పిలిస్తే అసలు కీలకం ఇట్టే చెప్పాడు. ఇదంతా సత్యం మొదటి పెళ్ళాం పనే!" అన్నాడు పెదనాన్న.

చిన్న తాతయ్య దగ్గాడు.

"అసలు సత్యానికి గురువులో శనీ! శని కోణంలో ఉన్నాడు. సప్తమంలో శుక్రుడూ ఉన్నారు... ఇంకా రెండేళ్ళ మూడునెల్లు పన్నెండు రోజులు అప్పటికి సత్యానికి మారకమన్నా కావలీ లేదా మంచి యోగమన్నా పట్టాలి. ఏదో ఒకటి తప్పదు" అన్నాడు చిన తాతయ్య.

నే నీ మాటలు వింటూండగా మా పెద్దన్న రెండో కూతురు ఎప్పుడో వచ్చి నా జేబులో పెన్ను లాగి మోకాలికి పెట్టి రెండుగా విరిచి కాళ్ళమీద సిరా పడ్డందుకు పెద్ద పెట్టున ఏడవసాగింది. మా పెద్దనాన్న చప్పున లేచి నా కండువాతో దాని కళ్ళు రెండూ తుడిచాడు.

మా చినతాత మా సత్యానికి రానున్న మారక యోగం సంగతే ఇంకా ఆలోచిస్తున్నట్టు కనపడ్డాడు. ఆయన నిట్టూర్చి "ఏమో, అన్నింటికీ భగవంతుడున్నాడు" అన్నాడు.